క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



పరిసరాలను శుభ్రం చేస్తున్న ఇన్‌చార్జ్ వీసీ ఎన్‌టీకే నాయక్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

కర్నూలు కల్చరల్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని రాయలసీమ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్ ఆచార్య ఎన్‌టీకే నాయక్ అన్నారు. శనివారం వర్సిటీ ప్రాంగణంలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో పచ్చదనం పరి పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఇన్‌చార్జ్ వీసీ మాట్లాడుతూ పరిశుభ్రతను కాపాడుకోవడానికి అందరూ కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ వెంకటరత్నం, డాక్టర్ విజయుడు, డాక్టర్ నాగచంద్రుడు, శివప్రసాద రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా రంగస్థల కళాకారుడికి 'షణ్ముఖి' పురస్కారం



గుర్రపుసాల అంకయ్య

కర్నూలు కల్చరల్: షణ్ముఖి ఆంజనేయ రాజు కళాపీఠం ప్రదానం చేసే షణ్ముఖి పురస్కారానికి జిల్లా రంగ స్థల సీనియర్ కళాకారుడు గుర్రపుసాల అంకయ్య ఎంపికయ్యారు. సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు రసరాజు, విజయ షణ్ముఖి అంకయ్యకు సమాచారం ఇచ్చారు. తణుకు సురాజ్య భవనంలో ఆదివారం నిర్వహించనున్న షణ్ముఖి ఆంజనేయ రాజు జయంతి కార్యక్రమంలో అంకయ్యకు పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. పురస్కారానికి ఎంపికైన అంకయ్యకు పలువురు కళాకారులు అభినందనలు తెలిపారు.

నేటి నుంచి నగర మహా సభలు



సమావేశంలో మాట్లాడుతున్న టి.రాముడు

కర్నూలు(సెంట్రల్): స్థానిక ఎంఎస్ ఫంక్షన్ హాలులో ఆదివారం నుంచి సీపీఎం నగర మహా సభలు నిర్వహించనున్నట్లు మహా సభల కమిటీ కార్యదర్శి టి.రాముడు తెలిపారు. శనివారం ఆయన సూర్యనారాయణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆదివారం ప్రతినిధుల సమావేశంతో మహాసభలు ప్రారంభమవుతాయని, సోమవారం సాయంత్రం కల్లూరులోని చెన్నమ్మ సర్కిల్‌లో బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. మహాసభల్లో కర్నూలుకు మరో ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణం, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీటి ఎద్దడి, పలు చోట్ల ఫ్లైఓవర్ బ్రిడ్జిల కోసం తీర్మానాలు చేసి వాటిని సాధించుకోవడం కోసం ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. సమావేశంలో నాయకులు సీహెచ్ సాయిబాబా, ఆర్.నరసింహులు, కె.సుధాకరప్ప పాల్గొన్నారు.

క్రీడలకు సహకారం అందిస్తా

కర్నూలు (టౌన్): షూటింగ్ బాల్ క్రీడాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని న్యాయవాది జి.శ్రీధర్ రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో సీనియర్ మహిళల షూటింగ్ బాల్ పోటీలు నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళల జూనియర్ కళాశాల ప్రథమ, బాలభారతి స్కూల్ ద్వితీయ, గుడ్ షప్పర్డ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ తృతీయ స్థానాల్లో నిలిచారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు బి.రామాంజనేయులు, షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరశురాముడు పాల్గొన్నారు.

● నెల్లూరు జిల్లా కావలిలో ఆదివారం నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి రగ్బీ సబ్ జూనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో సత్తా చాటాలని రగ్బీ సంఘం జిల్లా కార్యదర్శి రామాంజనేయులు క్రీడాకారులకు సూచించారు. శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఎంపిక క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ ప్రమోటర్ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు



ఎస్‌వీసీ కాంప్లెక్స్ :అమరన్, రోటి కపడా రొమాన్స్, జీబ్రా, భైరతి రణగల్, లక్కీ భాస్కర్, మెకానిక్ రాకీ
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ :కంగువ, అమరన్, రోటి కపడా రొమాన్స్, భైరతి రణగల్, ఇష్క్, ఉద్వేగం
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ :లక్కీ భాస్కర్
భరత్ కాంప్లెక్స్ : ఉక్కు సత్యాగ్రహం, కేశవ చంద్ర రమావత్ (కేసీఆర్)
రాజ్ : మెకానిక్ రాకీ
విజయ : భైరతి రణగల్
విక్టరీ టాకీస్ : అమరన్

సంగీత సవ్వడులు

● సంగీతం.. నృత్యం తదితర కళలు నేర్చుకునేందుకు పెరుగుతున్న ఆసక్తి
● వయస్సుతో నిమిత్తం లేకుండా శిక్షణ తరగతులకు హాజరవుతున్న వైనం
● సంగీత నృత్య కళాశాలలో క్రమంగా పెరుగుతున్న ఔత్సాహికుల సంఖ్య
● ఉదయం, సాయంత్రం వేళల్లో తరగతుల నిర్వహణ



కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు



వయోలిన్‌లో శిక్షణ పొందుతున్న యువతీ యువకులు

కర్నూలు కల్చరల్: ఉరుకులు పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరు ఒత్తిడికి గురవుతున్నారు. ఏ రంగంలో ఉన్నా దానికి తగిన ఒత్తిడితో మానసిక ప్రశాంతతను కోల్పోతూ అనారోగ్యం పాలవుతున్నారు. విద్యార్థులు మార్కులు.. ర్యాంకుల టెన్షన్, ఉద్యోగులు వృత్తిలో.. బిజినెస్ మెన్స్‌లు వ్యాపార లావాదేవీల్లో ఒత్తిడి తప్పడం లేదు. ఒత్తిళ్ల నుంచి ఉపశమనం పొందేందుకు పలువురు సంగీతం, నృత్యం తదితర కళలను నేర్చుకుంటున్నారు.

సీమలోనే ఏకైక ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల

కర్నూలులోని ప్రభుత్వ శారదా సంగీత, నృత్య కళాశాల రాయలసీమలోనే ఏకైక శిక్షణ కేంద్రం. ఇందులో గాత్రం, కూచిపూడి, డోలు, మృదంగం, వయోలిన్, నాదస్వరం కోర్సులు ఉన్నాయి. ఇక్కడ నాలుగేళ్ల సర్టిఫికెట్ కోర్సు, రెండేళ్ల డిప్లమా సర్టిఫికెట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిని నేర్చుకునే విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. కళాశాలలో వివిధ జిల్లాల విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. ఇక్కడ సర్టిఫికెట్, డిప్లమా కోర్సులు చేసిన వారు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొంది ఉన్నతంగా రాణిస్తున్నారు. మరికొందరు సొంతంగా శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసుకొని మరింత మందిని తీర్చి దిద్దుతున్నారు. గత ఏడాది గత ప్రభుత్వం కళాశాలలో పలు కోర్సులకు సంబంధించి ఫ్యాకల్టీ నియామకం చేపట్టింది. ఖాళీ పోస్టులన్నీ భర్తీ కావడంతో తరగతులు క్రమం తప్పకుండా జరుగుతున్నాయి.

నృత్యంపై ఇష్టంతో..



బీటెక్ పూర్తి చేసి ఇంజినీర్‌గా సచివాలయంలో ఉద్యోగం చేస్తున్నాను. చిన్నప్పటి నుంచి కూచిపూడి నృత్యం అంటే చాలా ఇష్టం ఉన్నా నేర్చుకోవడం వీలు కాలేదు. ఇప్పుడు కళాశాలలో చేరి సర్టిఫికెట్ కోర్సు మొదటి సంవత్సరం శిక్షణ పొందుతున్నాను.
– మానస, సచివాలయం ఉద్యోగి

గత ఆరు విద్యా సంవత్సరాల్లో ప్రవేశాల పొందిన వారు

కోర్సు	2019-20 విద్యార్థులు	2020-21 విద్యార్థులు	2021-22 విద్యార్థులు	2022-23 విద్యార్థులు	2023-24 విద్యార్థులు	2024-25 విద్యార్థులు
వోకల్ (గాత్రం)	106	110	120	146	142	162
వయోలిన్	59	55	73	71	78	90
మృదంగం	11	15	11	16	17	17
నాదస్వరం	6	7	10	11	18	8
కూచిపూడి నృత్యం	43	45	70	81	99	100
మొత్తం	225	232	284	325	354	377

ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత



ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో నాలుగేళ్ల నుంచి సంగీతం నేర్చుకుంటున్నాను. సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు రాసి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాను. అందరికి అనుకూలమైన సమయంలో తరగతులు నిర్వహించడంతో నేర్చుకోడానికి వీలైతుంది.
– అంబిక, గృహిణి

ఉత్తమ బోధన



సమాజ చైతన్య దీపికలు కళలు. ఇటీవల కాలంలో సంగీతం, నృత్యం, వయోలిన్ నేర్చుకునే వారి సంఖ్య పెరుగుతోంది. మానసికోల్లాసం, మంచి శరీర దారుఢ్యానికి లలిత కళలు ఉపయోగపడతాయి. కళాశాలలో అన్ని కోర్సులకు పూర్తి స్థాయిలో నిపుణులైన ఫ్యాకల్టీ ఉన్నారు. తరగతులు క్రమం తప్పకుండా జరుగుతున్నాయి. ఇటీవల వెలువడిన సర్టిఫికెట్, డిప్లమా కోర్సు పరీక్షల ఫలితాల్లో 84 శాతం ఉత్తీర్ణత నమోదైంది.
– మునికుమార్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ శారదా సంగీత, నృత్య కళాశాల, కర్నూలు

నృత్యం నేర్చుకోడానికి అవకాశం



నాకు కూచిపూడి నృత్యం ఇష్టం. చిన్నతనంలో నేర్చుకోడానికి అవకాశం రాలేదు. గృహిణిగా ఉన్న నాకు కొంత సమయం దొరకడంతో ప్రభుత్వం సంగీత, నృత్య కళాశాలలో కూచిపూడి నేర్చుకోడానికి చేరాను. ప్రస్తుతం నాలుగో సంవత్సరం సర్టిఫికెట్ కోర్సు అభ్యసిస్తున్నాను. నృత్యంలో మెలవలు తెలుసుకొని మంచి ప్రదన ఇవ్వాలన్నది నా కోరిక. త్వరలోనే అది నెరవేర్చుకుంటాననే నమ్మకం ఉంది.
– శ్రీవాణి, గృహిణి

సంగీతమంటే ఇష్టం



ఎకనామిక్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాను. సంగీతంపై ఇష్టంతో కర్నూలు సంగీత, నృత్య కళాశాలలో చేరాను. వోకల్ మొదటి సంవత్సరం సర్టిఫికెట్ కోర్సులో శిక్షణ పొందుతున్నాను. మంచి ఫ్యాకల్టీ ఉండటంతో సంగీతం శిక్షణలో మెలకువలు తెలుసుకోగలుగుతున్నాం. సర్టిఫికెట్, డిప్లమా కోర్సులు పూర్తి చేసి మంచి గాయనిగా రాణించాలని ఉంది. సంగీతం నేర్చుకుంటూ ప్రాక్టీస్ చేస్తుంటే మనసు ప్రశాంతంగా ఉంటుంది.
– ప్రణీత, పీజీ విద్యార్థి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కర్నూలు న్యూసిటీ: నిర్వహణ పనుల నిమిత్తం నగరంలోని సంతోష్ నగర్, బీ రోడ్, వెంకటరమణ కాలనీ సబ్ స్టేషన్ల పరిధిలో నేడు విద్యుత్ అంతరాయం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు ఈఈ శేషాద్రి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

8న క్రీడా భారతి ఆన్‌లైన్ పరీక్ష

కర్నూలు (టౌన్): ఈనెల 8న క్రీడా భారతి ఆధ్వర్యంలో ఆన్‌లైన్ క్రీడా జ్ఞాన్ పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి బి.భూపతిరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు http:kreeda bharati.orf వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పరీక్ష సమయం 25 నిముషాలు ఉంటుందని, 50 ప్రశ్నలు ఉంటాయని తెలిపారు. 12 ఏళ్ల దాటిన వారు అర్హులన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి కింద రూ.50 వేలు, మూడవ బహుమతి రూ.25 వేలు, నాలుగవ బహుమతి రూ.11 వేల నగదు ప్రోత్సాహక బహుమతులు ఉంటాయన్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 91 శాతం హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన 5వ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలకు 91 శాతం హాజరు నమోదైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 61 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరగగా 8,628 మందికి 7,851 మంది విద్యార్థులు హాజ రు కాగా 777 మంది గైర్హాజరైనట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. కర్నూలు డిగ్రీ కళాశాల కేంద్రంలో చూచిరాతకు పాల్పడిన ఒక విద్యార్థిని డిబార్ చేసినట్లు తెలిపారు. కోడుమూరులోని సాయిరాం డిగ్రీ కళాశాల, శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాలల్లోని కేంద్రా లు, గూడూరులోని ఎస్ఆర్ డిగ్రీ కళాశాల, శ్రీ సాయి వెంకటేశ్వర డిగ్రీ కళాశాలల్లోని కేంద్రాలను వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నా యక్, వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లుతో కలిసి సందర్శించి పరిశీలించారు. ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పరీక్షలు సజావుగా నిర్వహించాలని పరీక్షల అధికారులను వీసీ ఆదేశించారు.

దీప ప్రజ్వలనం.. మోక్ష ప్రదం



జ్యోతులు వెలిగిస్తున్న ఎస్వీ విజయ మనోహరి, సమితి సభ్యులు

కర్నూలు కల్చరల్: కార్తీక మాసం చివరి శనివారంను పురస్కరించుకొని కార్తీక దీపోత్సవ సమితి, భరత మాత మాతృ మండలి ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వీఆర్ కాలనీలోని వెంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో చిన్న కృష్ణుని రూపం, వెంకటేశ్వరస్వామి వారి తిరునామం, శంకు చక్రం, స్వస్తిక్, త్రిశూలం ఆకారంలో ప్రమిదలను ఏర్పాటు చేసి జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. కేడీసీసీబీ మాజీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి, కార్తీక దీపోత్సవ సమితి కార్యాధ్యక్షులు పద్మావతి, సభ్యులు జయలక్ష్మి, స్వప్న, ఉమాదేవి, అనిత, అనురాధ, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక యువకుడి మృతి

ఆలూరు రూరల్: మండలంలోని హత్తిబెళగల్ గ్రామానికి చెందిన సద్దాం హుసేన్ (35) ఐదు రోజుల క్రితం స్కూటర్ అదుపుతప్పి గాయపడి కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం మృతిచెందాడు. వివరాలు.. గ్రామంలోని అమినాబీ, హుసేన్‌వలి దంపతుల మూడవ కుమారుడు సద్దాం హుసేన్ (35) మంగళవారం రాత్రి గ్రామ సమీపంలోని ఈద్గా వద్ద స్కూటర్ అదుపుతప్పి కింద పడ్డాడు. బంధువులు చికిత్స నిమిత్తం బళ్లారి ఆసుపత్రిలో చేర్పించారు. మెరుగైన చికిత్స కోసం రెండు రోజుల క్రితం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శనివారం కోలుకోలేక మృతి చెందాడు.

పదవీ విరమణ సమస్యలుంటే నేరుగా కలవండి

● ఎస్పీ బిందు మాధవ్



పోలీసు అధికారులను సత్కరిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు: పదవీ విరమణ సందర్భంగా రావాల్సిన బెనిఫిట్స్ గురించి ఏవైనా సమస్యలు తలెత్తితే నేరుగా తనను కలవాలని ఎస్పీ బిందు మాధవ్ సూచించారు. సుదీర్ఘ కాలం జిల్లా పోలీసు శాఖలో పనిచేసి ఎస్ఐ ఆర్.శ్రీనివాసులు, ఏఆర్ ఎస్ఐ సమీర్‌బాషా పదవీ విరమణ పొందారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ బిందు మాధవ్ వారికి శాలువా, పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శేష జీవితం కుటుంబాలతో సంతోషంగా గడపాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, సీఐలు ప్రసాద్, శివశంకర్, ఆర్ఐలు సోమశేఖర్‌నాయక్, నారాయణ, జిల్లా పోలీసు అధి కారుల సంఘం అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): హెచ్ఐవీ పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ సూచించారు. శనివారం కాలేజీలోని ఓల్డ్ సీఎల్‌జీలో ఏఆర్‌టీ ప్లస్ సెంటర్ ఆధ్వర్యంలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ డమామ్ శ్రీనివాసులు అధ్యక్షతన ఎయిడ్స్ డేను పురస్కరించుకుని పీజీలు, సిబ్బందికి హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నిరంతరం పరిశోధనల ఫలితంగా మెరుగైన ఫలితాలిస్తున్న మందులు అందుబాటులోకి వచ్చాయన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తన ఆరోగ్యం తన హక్కుగా భావించాలని, అందుకు సరైన మార్గాన్ని ఎన్నుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎయిడ్స్ చికిత్సలో అధునాతన మందులు అందుబాటులోకి వచ్చాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రభ, డాక్టర్ కుముద పాల్గొన్నారు.

ఒకేసారి మూడు శస్త్రచికిత్సలతో ప్రాణదానం



కోలుకున్న చంద్రమోహన్‌తో డాక్టర్ జానకీరామ్

కర్నూలు(హాస్పిటల్): అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న రోగికి ఒకేసారి మూడు శస్త్రచికిత్సలు నిర్వహించి అతడి ప్రాణాలు కాపాడినట్లు కర్నూలు కిమ్స్ హాస్పిటల్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ ఎస్.జె.జానకీరామ్ చెప్పారు. శనివారం కిమ్స్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాడిపత్రికి చెందిన చంద్రమోహన్(50)కు గతంలో తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ వేర్వేరు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నాడన్నారు. హైదరాబాద్ వెళ్లి చికిత్స చేయించుకున్నా ఫలితం లేకపోవడంతో కర్నూలు కిమ్స్‌కు వచ్చినట్లు తెలిపారు. ఆయనకు వైద్యపరీక్షలు చేయగా చిన్నపేగులకు రక్తం సరఫరా అయ్యే ప్రధాన రక్తనాళంలో అడ్డంకి ఏర్పడటం, పెద్దపేగు, చిన్నపేగు కలిసేచోట కొంత పాడైపోవడం, గాల్‌బ్లాడర్‌లో రాయి ఇబ్బంది పెడుతుండటం గుర్తించామన్నారు. ముందుగా గాల్‌బ్లాడర్‌ను, పాడైన కొంత పేగును తొలగించి కింద ఉన్న రెండు భాగాలను కలిపేశామన్నారు. దీనివల్ల అతని సమస్యలన్నీ తొలగిపోయి కోలుకున్నట్లు తెలిపారు.

వక్ఫ్, దేవదాయ ఆస్తులను కాపాడండి

● కలెక్టర్ పి.రంజిత్‌బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని వక్ఫ్, దేవదాయ భూములు ఆక్రమణకు గురి కాకుండా కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందని కలెక్టర్‌పి.రంజిత్‌బాషా సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన జిల్లా వక్ఫ్ ప్రొటెక్షన్ కమిటీ తొలి సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి వక్ఫ్, దేవదాయ భూములను పరిరక్షించాలన్నారు. ఆయా బృందాలు వక్ఫ్, దేవదాయ భూములను తనిఖీ చేసి ఎక్కడైనా ఆక్రమణలకు గురై ఉంటే 10 రోజుల్లో కమిటీకి నివేదించాలని ఆదేశించారు. ఇక నుంచి జిల్లా కమిటీ 15 రోజులకోసారి సమావేశమై ఆక్రమణకు గురైన భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటుందని చెప్పారు. వక్ఫ్, దేవదాయ భూముల ఆక్రమణలకు సంబంధించి పోలీసు శాఖ వెంటనే స్పందించాలన్నారు. ఇప్పటి వరకు కేసులు ఏమైనా నమోదు చేశారా అని పోలీసులను ఆరా తీశారు. వక్ఫ్, దేవదాయ భూముల ఆక్రమణలకు సంబంధించి కలెక్టరేట్, సబ్‌కలెక్టర్, ఆర్‌డీఓలు, మైనార్టీ వెల్ఫేర్, ఎండోమెంట్ శాఖల దగ్గర ఉన్న ఫిర్యాదులను అన్నింటిని ఒకేచోటకు చేర్చి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. వక్ఫ్, దేవదాయ భూముల సర్వే కోసం ఒక యాప్‌ను రూపొందించాలని డీఆర్వోను ఆదేశించారు. భూములను రిజిస్ట్రేషన్ చేసే సమయంలో నిబంధనలు పాటించకుండా పొరపాట్లు చేస్తే చర్యలు తప్పవని రిజిస్ట్రార్లను కలెక్టర్ హెచ్చరించారు. కార్యక్రమంలో జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్‌డీఓ సందీప్‌కుమార్, కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు, మైనార్టీ సంక్షేమాధికారి సబీహా పర్వీన్, ఆన్‌లైన్‌లో ఆదోని సబ్ కలెక్టర్, పత్తికొండ ఆర్‌డీఓ, మునిసిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

రూ.102.55 కోట్లు పెన్షన్ల మొత్తం పంపిణీ

కర్నూలు (టౌన్): జిల్లాలోని 2,40,330 పెన్షన్‌దారులకు రూ.102.55 కోట్ల పెన్షన్ మొత్తం పంపిణీ చేసినట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. శనివారం ఉదయం కర్నూలు నగరంలోని జొహరాపురంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద అచ్చమ్మ, లచ్చమ్మలకు వృద్ధాప్య పెన్షన్, ప్రమీలమ్మకు వితంతు పెన్షన్, జ్యోతికి ఒంటరి మహిళ పెన్షన్‌లను జిల్లా కలెక్టర్ ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పథకంలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మార్గదర్శకాలను విడుదల చేసిందన్నారు. ఈ మార్గ దర్శకాల ప్రకారం పెన్షన్ తీసుకుంటున్న కుటుంబ యజమాని మరణిస్తే వచ్చే నెల నుంచి అతని భార్యకు వితంతు పెన్షన్ మంజూరు అవుతుందన్నారు.

డంప్ యార్డు పరిశీలన

జొహరాపురంలోని కేసీ కెనాల్ ప్రాంతాన్ని, డంప్ యార్డును కలెక్టర్ పరిశీలించారు. కేసీ కెనాల్‌కు ఇరువైపులా కంచె ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. డంప్ యార్డును శుభ్రం చేయించాలన్నారు. జొహరాపురం నుంచి వెంకాయ పల్లె వరకు 3 కిలోమీటర్లు రోడ్లు వేయించాలన్నారు.

విధి నిర్వహణలో అంకితభావం ముఖ్యం



మద్దయ్యను సన్మానిస్తున్న దృశ్యం



కుమారస్వామిని సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు(అర్బన్): ఉద్యోగులు తమ విధి నిర్వహణలో చూపిన అంకితభావమే కలకాలం గుర్తుంటుందని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చీఫ్ ఇంజినీరు జయరామాచారి, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి టి.చిరంజీవి అన్నారు. శనివారం స్థానిక సంక్షేమభవన్‌లో ఏర్పాటు చేసిన జిల్లా గృహ నిర్మాణ సంస్థ కార్యాలయ మేనేజర్ మద్దయ్య పదవీ విరమణ సన్మాన సభలో వారు మాట్లాడారు. మద్దయ్య అంకితభావంతో విధులు నిర్వహించారని కొనియాడారు.

● కుమారస్వామికి..

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అకౌంటెంట్/ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ శనివారం పదవీ విరమణ చెందిన కుమారస్వామిని ఘనంగా సన్మానించారు. ప్రాంతీయ శిక్షణా కేంద్రం (ఫీమేల్) ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ డీడీ రామనాథ్, ఏపీఎన్‌జీఓస్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంగల్‌రెడ్డి తదితరులు హాజరై కుమారస్వామి సేవలను కొనియాడారు.

● డీపీహెచ్ఎన్ఓ ఇందిరకు..



ఇందిరను సన్మానిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్.భాస్కర్

కర్నూలు (హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో డిస్ట్రిక్ట్ పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ (డీపీహెచ్ఎన్ఓ)గా పనిచేస్తున్న ఇందిర శనివారం ఉద్యోగ విరమణ సందర్భంగా ఆమెను డీఎంహెచ్ఓ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ 1985లో వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగిగా చేరిన ఇందిర వివిధ కేడర్లలో ఉత్తమ సేవలు అందించారన్నారు.

తాగునీటి ఇబ్బందులు పరిష్కరిస్తాం

కర్నూలు (టౌన్): స్థానిక స్వామిరెడ్డి నగర్‌లో తాగునీటి సరఫరాలో తలెత్తిన ఇబ్బందులను పరిష్కరిస్తామని నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు తెలిపారు. శనివారం కాలనీలో పర్యటించారు. తాగునీటిలో దుర్వాసన వస్తోందని కాలనీవాసులు కమిషనర్ దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కాలనీలో వృద్ధాప్య పెన్షన్ పంపిణీ చేశారు.